
ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక




సంపుటి: 3 | సంచిక: 339 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం 19 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నారు



**హిల్ట్ పాలసీపై విచారణకు సిద్ధం**

**కేటీఆర్, హరీశ్ లేఖరాసిన వెంటనే ఆదేశిస్తా**

**మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నారు**

**అసెంబ్లీకి రాకుండా కేసీఆర్ రూ.1.06 కోట్ల వేతనం తీసుకున్నారు**

**బుల్లెట్ ట్రైన్ హబ్‌కు 500-600 ఎకరాలు కేటాయిస్తా**

**స్వశక్తితో ఎదిగాను.. నేను కష్టజీవిని..**

**'గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం'లో సీఎం**

**హైదరాబాద్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

హిల్ట్ విధానంలో పరిశ్రమల తరలింపు, భూవినియోగ మార్పిడి, టీడీఆర్ బదిలీలపై 2014 జూన్ 2 నుంచి ఇప్పటివరకు జరిగిన కార్యకలాపాలపై ఏ విచారణకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. కేటీఆర్, హరీశ్‌రావులు దీనిపై లేఖరాస్తే వెంటనే ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సీబీఐ, ఈడీ, ఆదాయపన్ను, సిట్ లేదా అంతర్జాతీయ సంస్థతో వారు కోరినట్టుగా విచారణ చేయించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 'ఆనాడు అక్రమ కట్టడాలను కూల్చడానికి నోటీసు కూడా అక్కర్లేదని కేసీఆర్ అన్నారు. మూసీలో 10 వేల అక్రమ కట్టడాలు గుర్తించామని, వాటిని కూల్చేస్తామని కేటీఆర్ కూడా ప్రకటించారు' అని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు మూసీ పునరుజ్జీవంతో హైదరాబాద్ రూపురేఖలు మార్చే ప్రయత్నం చేస్తుంటే అడ్డుకుంటూ బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం ధ్వజమెత్తారు. రీజినల్ రింగురోడ్డు దక్షిణ భాగానికి ఏప్రిల్ తర్వాత అనుమతి రానుందని, మెట్రోరైలు విస్తరణ సహా అనేక అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని.. బుల్లెట్ రైలు హబ్ కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో 500-600 ఎకరాలు కేటాయించనున్నట్లు తెలిపారు. శాసనసభలో బుధవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం మాట్లాడారు. వివిధ పార్టీలు, సభ్యులు లేవనెత్తిన అంశాలకు సమాధానమివ్వడంతోపాటు ప్రభుత్వ ప్రాధాన్యాలపై రెండున్నరగంటలకు పైగా ప్రసంగించారు. 2023 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు కేసీఆర్ అసెంబ్లీకి రాకుండానే రూ.1.06 కోట్ల వేతనం, భత్యాలు తీసుకున్నారని.. దీనిపై చర్చ జరగాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ సభకు హాజరుకావాలని కోరారు. సోనియాగాంధీ ఆశీర్వాదంతో తెలంగాణ వచ్చిందని కేసీఆర్ శాసనసభలోనే ఒప్పుకొన్నారన్నారని సీఎం తెలిపారు.



ఏప్రిల్‌లో రెండో విడత

# ఇందిరమ్మ ఇళ్లు

**మార్చి నాటికి లక్ష నిర్మాణాలు పూర్తి**

**మండలిలో గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**


రాష్ట్రంలో ఏటా ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని, 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్, మే నెలల్లో రెండో విడత ప్రకటిస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో మంజూరై వివిధ స్థాయుల్లో నిలిచిపోయిన గృహాలను పూర్తిచేసేలా అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు వచ్చే ఏడాది పథకంలో వివరిస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ తొలిదఫా పథకంలో మార్చి నెలాఖరు నాటికి లక్ష గృహాలు, జూన్, జులై నాటికి 3 లక్షల నిర్మాణాలు పూర్తవుతాయని వెల్లడించారు. శాసనమండలిలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మధుసూదనాచారి, వెంకట్ నర్సింగరావులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. బ్యాంకు రుణాలతో కార్లు కొనుగోలు చేసి డ్రైవర్లుగా కొనసాగుతున్న వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదని, అర్హులందరికీ న్యాయం జరిగేలా ఇందిరమ్మ గృహాల పథకం నిబంధనల్లో మార్పులు చేయాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంత్రికి సూచించారు. మంత్రి మాట్లాడుతూ.. "రెండు పడక గదుల ఇళ్ల పథకానికి పెండింగ్ బిల్లులు మంజూరు చేసి, చిన్నచిన్న పనులు పూర్తిచేసి 18,579 గృహాలు త్వరలో కేటాయిస్తాం. పట్టణ పేదలకు గృహాలు కేటాయించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. పనిచేసే ప్రాంతానికి ఒకటి రెండు కిలోమీటర్ల దూరంలోనే ఈ ప్రాజెక్టులు ..మిగతా 2లో

# మొదటి దశ డీపీఆర్ సిద్ధం: శ్రీధర్‌బాబు

**అది రూ.లక్షన్నర కోట్ల దోపిడీ: కేటీఆర్**

**కాంగ్రెస్, భారాస పక్షాల వాగ్వాదం**

**ప్రభుత్వ వైఖరికి నిరసనగా భారాస వాకౌట్**



**హైదరాబాద్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర శాసనసభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో మూసీనది ప్రక్షాళనపై వాడీవేడి చర్చ జరిగింది. ప్రాజెక్టు కార్యాచరణ, డీపీఆర్, భూసేకరణ, నిధుల లభ్యత, ఇళ్ల కూల్చివేత, సహాయ పునరావాసం తదితర అంశాలపై ఆద్యంతం అధికార, విపక్షాల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి మూసీ నది ప్రక్షాళనపై తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో పేదల ఇళ్లను కూలుస్తూ, రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి పాల్పడుతున్నందున దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని భారాస ఎమ్మెల్యే కేటీ రామారావు పునరుద్ఘాటించారు. గత అసెంబ్లీ ..మిగతా 2లో

# సీఎస్ కె.రామకృష్ణారావు పదవీకాలం 3 నెలలు పొడిగింపు

**హైదరాబాద్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**




రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావు పదవీకాలాన్ని మరో మూడు నెలలు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2025 ఏప్రిల్ 30న సీఎస్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అదే ఏడాది ఆగస్టు 31తో పదవీకాలం ముగియగా.. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ఏడు నెలలు పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండడంతో.. ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగించాలని కోరుతూ విన్నవించింది. అందుకు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు సీఎస్‌గా రామకృష్ణారావు పదవీకాలాన్ని పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చింది.

# ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్ మృతి

**ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి**

**న్యూఢిల్లీ, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం మరింత తీవ్రమైంది. ఏకంగా ఇరాన్‌లోని అణు కేంద్రంపైనే ఇజ్రాయెల్ దాడులు చేసింది. అయితే ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. ఈ ప్రాంతంలో అణు ధార్మికతపై ఇరాన్, రష్యా ఆందోళన వ్యక్తం చేశాయి. మరోవైపు ఇరాన్ నిఘా మంత్రినీ ఇజ్రాయెల్ చంపేసింది. దీంతో రెండు రోజుల్లోనే ముగ్గురు కీలక నేతలను ఇరాన్ కోల్పోయినట్లయింది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. ఈ దాడిని ఖతార్ ఖండించింది. గ్యాస్ క్షేత్రంపై ప్రతిగా గల్ఫ్‌లోని చమురు క్షేత్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. అలీ లారిజానీ, గులాం రెజా మరణాలకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్‌లోని 100కుపైగా లక్ష్యాలపై క్షిపణులను ప్రయోగించింది. తన అత్యాధునిక క్షిపణులను వినియోగించింది. టెల్ అవీవ్‌లో ఇద్దరు మరణించారు.



హర్మూజ్ జల సంధివద్ద ఇరాన్ తీరంలోని క్షిపణి ప్రయోగ కేంద్రాలపై అమెరికా అతి పెద్ద బంకర్ బస్టర్ బాంబులతో దాడి చేసింది. 2,268 కేజీల బరువున్న ఈ బాంబులను అమెరికా ఇరాన్‌పై వేయడం ఇది ఇటీవలి కాలంలో రెండోసారి. చమురు, గ్యాస్ క్షేత్రాలపై దాడుల కారణంగా ముడిచమురు ధర మళ్లీ పెరిగింది. 110డాలర్లకు చేరుకుంది. ఇరాన్ నిఘాశాఖ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌ను మంగళవారం రాత్రి జరిగిన దాడుల్లో చంపేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ తెలిపారు. మరిన్ని ఆశ్చర్యకర వార్తలనూ వింటారని ఆయన పేర్కొన్నారు. ఖతీబ్ మృతిని ఇరాన్ ధ్రువీకరించింది. ఆయనతోపాటు సీనియర్ అధికారులు మరణించారని ..మిగతా 2లో



# తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు 2029లోనే

**దిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి**

**మహిళా రిజర్వేషన్లు ఎప్పుడు అమల్లోకి వచ్చినా మాకు ఇబ్బంది లేదు**

**న్యూఢిల్లీ, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం 2028లో రావని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి జమిలి ఎన్నికలు జరుగుతాయని అభిప్రాయ పడ్డారు. కేంద్ర ప్రభుత్వం చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లను 2034కి బదులుగా 2029 ఎన్నికల్లోనే అమలుచేసేందుకు వీలుగా నారీశక్తి వందన్ అధి నియమ్‌ను సవరణ చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు వార్త లు వస్తున్న నేపథ్యంలో ఆ విషయంపై విలేకర్లు ముఖ్యమంత్రి అభిప్రాయాన్ని కోరినప్పుడు ఆయన ..మిగతా 2లో



# పార్లమెంట్‌ను ఓపెన్ యూనివర్సిటీగా అభివర్ణించిన మోదీ

2

**రాజకీయాల్లో పూర్తి విరామం ఉండదు**

**59 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది.**

**దేవెగౌడపై ఖర్గే వ్యాఖ్యలు.. మోదీ నవ్వులు**

# ప్రజలకు ఉపయోగ పడే సులబ్ కాంప్లెక్స్ కట్టి తీరుతాం

**ప్రజలకిచ్చిన సొమ్మును ప్రయివేటు వ్యక్తులు దోచుకుంటే ఊరుకునే ప్రసక్తేలేదు**

**కోర్ట్ నోటీసులతో భయపెడితే భయపడను**

**సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 18 (ప్రభాత ఉదయం)**



ప్రజలకు ఉపయోగ పడే సులబ్ కాంప్లెక్స్ కట్టి తీరుతాం, ప్రజలకిచ్చిన సొమ్మును ప్రయివేటు వ్యక్తులు దోచుకుంటే ఊరుకునే ప్రసక్తేలేదని, కోర్ట్ నోటీసులతో భయపెడితే భయపడనని దేవరుప్పుల సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ అన్నారు. జిల్లా లోని దేవరుప్పుల మండల కేంద్రానికి ఇతర మండలాల నుండి ప్రజలు తమ అవసరాల కోసం వస్తూ పోతుంటారని, ప్రయాణికులు సుదూరాలకు వెళ్లేందుకు చౌరస్తాలో గంటల తరబడి నిరీక్షిస్తుంటారని, అయితే ఇక్కడ మూత్రశాలలు లేక ముఖ్యంగా మహిళలు తీవ్రయిబ్బందులు ఎదుర్కొంటున్నారని .పాత బస్టాండ్ స్థలంలోనే సులబ్ కంప్లెక్స్ నిర్మించాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అఖిల పక్ష నాయకులు బస్టాండ్ ఆవరణలో ధర్నాలు కూడా చేశారని, అందులో భాగంగానే గత వారం దేవరుప్పుల మండల ఎంపీడీఓ మేనకా పౌడేల్ ప్రొసీడింగ్ కాపీని దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ కు అందజేశారని, సర్పంచ్ కృష్ణమూర్తి సులబ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించగా, అ స్థలం నాది అని కొందరు దేవరుప్పుల సర్పంచ్ కృష్ణమూర్తికి కోర్టు నుండి నోటిసులు పంపించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణమూర్తి బుధవారం మీడియాతో మాట్లాడుతూ దేవరుప్పుల మండలకేంద్రం అభివృద్ధి కోసం మహిళల ఆత్మగౌరవం కోసం మండలకేంద్రంలోని చౌరస్తా సమీపంలో సులబ్ కాంప్లెక్స్ కావాలని పార్టీలకు అతీతంగా ప్రజానాయకులు పోరాటం చేశారని, గత యాభై సంవత్సరాల క్రితమే బస్టాండ్ కోసం గోలి మల్లారెడ్డి ఆర్టీసికి దానం ఇచ్చాడని, అప్పుడే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ బస్టాండ్ ను నిర్మించిందని, ఆ విషయం చుట్టూ ప్రక్కల గ్రామ ప్రజలందరికి తెలుసని, కానీ ఇప్పుడు ఆ స్థలం కావాలని ఆ స్థలం మాకు రిజిస్ట్రేషన్ అయ్యిందని, ఆ స్థలం మాదేనని మల్లారెడ్డి కూతురు రేణుక బూటకపు మాటలు మాట్లాడుతున్నారని, మహిళల ఆత్మగౌరవం కాపాడేందుకు ప్రజల సౌకర్యం కోసం సర్పంచ్ గా గెలిచిన తర్వాత అధికారులు, స్వచ్ భారత్ సూచన మేరకు ఇక్కడ సులబ్ కాంప్లెక్స్ కట్టడం కోసం ఉత్తర్వులు జారీచేశారని, అందులో భాగంగానే ఇక్కడ సులబ్ కాంప్లెక్స్ నిర్మించడంకోసం పనులు ప్రారంభించానని, ఎప్పుడైతే పనులు ప్రారంభించానో మల్లారెడ్డి కూతురు కోర్టు నుండి నాకు ఉత్తరం పంపిందని, అందుకు కొంతమంది వారికి తొత్తులుగా మారి వారికి సలాహాలు ఇస్తూ ఇక్కడ జరిగే అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా తీర్మాణం చేసిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తీర్మాణం చేసిందని, ప్రజల వసతుల కోసం కోర్టు ఆదేశానుసారం ఎంత దూరమైనా వెళతానని, ప్రజల పక్షాన నిలబడి కొట్లాడి ఇక్కడ సులబ్ కాంప్లెక్స్ నిర్మించడానికి సిద్ధంగా ఉన్నానని, మహిళల ఆత్మగౌరవం కోసం త్వరలో కలెక్టర్ ని కలిసి వినతి పత్రాన్ని ఇస్తానని, ప్రజలకు సంభందించిన సొమ్మును ప్రయివేటు వ్యక్తులు దోచుకోకుండా కాపాడుకోవాలని మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నానని, ఇక్కడ సులబ్ కాంప్లెక్స్ నిర్మించడానికి ఎవరు అడ్డోచ్చినా మనందరం కలిసిగట్టుగా పార్టీలకు అతితంగా ఉండి పోరాడుదామని విజ్ఞప్తి చేస్తున్నానని కోరారు, ఒకవేళ ఈ బస్టాండ్ స్థలాన్ని కూల్చి ఆ స్థలాన్ని ఆక్రమించుకుంటే ప్రజలందరూ తిరుగుబాటు చేయాలని, అదేవిధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులందరూ కూడా సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చిలుకూరి నర్సయ్య, గొడిశాల శ్రీనివాస్, తోటకూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు చింత ఐలయ్య, కారుపోతుల సోమయ్య, రెడ్డిరాజుల కిష్టయ్య, గొడిశాల రాములు, రుద్రోజు చారి, కడారి అంజయ్య, భాషిపాక మధు, కారుపోతుల మహేష్, పత్తేపురపు శేఖర్,తోటకూరి మహేష్, చిలుకూరి ఉమేష్, కారుపోతుల సురేష్, ఉప్పుల విజయ్, గంగాడి అఖిల్, గ్రామస్తులు, ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్‌లో రెండో విడత
# ఇందిరమ్మ ఇళ్లు

తీసుకువచ్చి సొంతింటి కల నెరవేర్చుతాం. అర్హులకు గృహాలు రాకుంటే ఆ వివరాలివ్వాలి.. సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకుంటాం” అని తెలిపారు.

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు**

రాష్ట్రంలో మరణించిన 671 మంది జర్నలిస్టుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కుటుంబాలకు పింఛను, పిల్లలకు ట్యూషన్ ఫీజు, శాశ్వత అంగవైకల్యానికి గురైతే ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. జర్నలిస్టుల సమస్యలను ఎమ్మెల్సీలు సత్యం, తీన్మార్ మల్లన్న, తక్కెళ్లపల్లి రవీందర్ ప్రస్తావించారు. మంత్రి సమాధానమిస్తూ.. “అక్రిడిటేషన్ కార్డుల జారీలో అందరికీ న్యాయం జరిగేలా సవరణ జీవో ఇచ్చాం. గతంలో నిలిచిపోయిన ఇంటిస్థలాలు మంజూరు చేసినా, సుప్రీంకోర్టు ఆదేశాలతో అడ్డుకట్ట పడింది.. అందుకే త్వరలోనే జర్నలిస్టులందరికీ తీపికబురు వినిపిస్తామని సీఎం ప్రకటించారు. న్యాయవివాదాలకు తావు లేకుండా గృహపథకం అమలు చేస్తాం” అని పొంగులేటి తెలిపారు.

## ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి
# ఇస్మాయిల్ ఖతీబ్ మృతి

మొదటి పేజీ తరువాయి...

తెలిపింది. పిరికి దాడులకు ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. ఖతీబ్ మృతికి సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సంతాపం తెలిపారు. మంగళవారం జరిగిన దాడుల్లో ఇరాన్ భద్రతాధికారి లారిజానీ, బసీజ్ దళం అధిపతి గులాం రెజా మరణించిన సంగతి తెలిసిందే.

తమకు వ్యతిరేకంగా సైబర్ నేరాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఖతీబ్‌పై 2022లో అమెరికా ఆంక్షలు విధించింది.

లారిజానీ, ఆయన కుమారుడి మృతిపట్ల మొజ్తాబా సంతాపం తెలిపారు. 5 దశాబ్దాలపాటు ఆయన రాజకీయంగా, సైనికపరంగా, భద్రతాపరంగా, సాంస్కృతిక పరంగా, పాలనాపరంగా సేవలందించారని కొనియాడారు. ఆయన మృతికి కారకులైన వారికి శిక్ష తప్పదన్నారు.

ఇరాన్‌లోని బుషెహర్ అణు కేంద్రంపై ప్రొజెక్టైల్‌తో దాడి జరిగింది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థకు (ఐఏఈఏ) ఈ దాడి గురించి ఇరాన్ సమాచారం ఇచ్చింది. పక్కనే తాము నిర్వహిస్తున్న అణు విద్యుత్తు ప్లాంటు ఉండటంతో రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్లాంటులో 480 మంది రష్యన్లు పని చేస్తున్నారు. రష్యా స్వల్పంగా శుద్ధి చేసిన యురేనియంతో ఇది నడుస్తోంది. ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాదం లేదని రష్యా వెల్లడించింది.

బుషెహర్ అణు విద్యుత్ కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికాలు చేసిన దాడిని రష్యా ఖండించింది. ‘బాధ్యతా రహితమైన ఈ క్షిపణి దాడిని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. అణు విద్యుదుత్పాదన యూనిట్‌కు కొన్ని మీటర్ల దూరంలో క్షిపణి పేలింది’ అని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా షరపోవా పేర్కొన్నారు. పరిశ్రమలపై ఇజ్రాయెల్, అమెరికాలు చేస్తున్న దాడులు పర్యావరణ విధ్వంసానికి దారితీస్తున్నాయని, ఆ కారణంగా దాడుల్ని తక్షణం నిలిపివేయాలని ఇజ్రాయెల్ రాయబారికి రష్యా ప్రభుత్వం స్పష్టం చేసింది. రష్యా విదేశాంగ ఉప మంత్రి జార్జి బోరిసెంకో బుధవారం మాస్కోలో ఇజ్రాయెల్ రాయబారి ఓడెడ్ యూసెఫ్‌ను కలిశారు.

## పార్లమెంట్‌ను ఓపెన్ యూనివర్సిటీగా
# అభివర్ణించిన మోదీ

**న్యూఢిల్లీ, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

రాజ్యసభలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. అనేక అంశాలపై అధికార, విపక్ష నేతల మధ్య వాడీవేడీ చర్చ జరిగే సభలో నేడు ఆహ్లాదకర వాతావరణం కనిపించింది. జేడీఎస్ అధినేత దేవెగౌడ సహా పలువురి సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వీడ్కోలు ప్రసంగం చేశారు. ఈ క్రమంలో మాజీ ప్రధాని దేవెగౌడను ఉద్దేశిస్తూ.. ‘ప్రేమ, పెళ్లి’ పదాలను ఉపయోగించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఖర్గే మాటలతో ప్రధాని మోదీ కూడా నవ్వులు చిందించారు.

“దేవెగౌడతో 54ఏళ్లుగా పరిచయం. వారితో కలిసి పనిచేశాను. కానీ, ఏం జరిగిందో తెలియదు కానీ, మాతో కలిసి పనిచేసి.. చివరకు కేంద్రంలోని అధికార పార్టీతో చేతులు కలిపారు” అని ఖర్గే పేర్కొన్నారు. ఈ క్రమంలో తమతో ‘డేటింగ్’ చేసి వారిని ‘పెళ్లి’ చేసుకున్నారనే పదాలు వాడడంతో సభలు నవ్వులు విరిశాయి. 1996 లోక్‌సభ ఎన్నికల తర్వాత యునైటెడ్ ఫ్రంట్ ఏర్పడగా.. దేవెగౌడ కొంతకాలం ప్రధానమంత్రిగా పనిచేశారు. ఆ కూటమికి కాంగ్రెస్ బయటనుంచి మద్దతు ఇచ్చింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సమయంలోనూ జేడీఎస్, కాంగ్రెస్‌లు కలిసి పోటీచేశాయి. ఆ తర్వాత ఎన్డీయేతో పొత్తుపెట్టుకున్న జేడీఎస్.. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో కొనసాగుతోంది. ఈ పరిణామాలను ప్రస్తావిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్, జులై మధ్యకాలంలో 59 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సభలో ప్రసంగిస్తూ.. వారి సేవలను కొనియాడారు. పార్లమెంట్‌ను ఓపెన్ యూనివర్సిటీగా అభివర్ణించిన మోదీ.. రాజకీయాల్లో పూర్తి విరామం అనేది ఉండదన్నారు.



# మొదటి దశ డీపీఆర్ సిద్ధం: శ్రీధర్‌బాబు

సమావేశాల్లో మంత్రి శ్రీధర్‌బాబు 18 నెలల్లో డీపీఆర్ సిద్ధం చేస్తామని చెప్పారని.. ఇప్పుడు రెండు నెలల్లోనే ఎలా చేశారని కేటీఆర్ ప్రశ్నించారు. మూసీని జీవనదిగా మార్చాలని, ప్రజల జీవితాలు బాగు చేయాలన్న సంకల్పంతో ఒక యజ్ఞంలా దీనిని చేపడుతున్నామని, అడ్డుపడటం తగదని మంత్రి శ్రీధర్‌బాబు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు సూచించారు. భారాస తన వైఖరి మార్చుకోవాలని, ఆ పార్టీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. వారి సమాధానాలపై భారాస సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. రూ.16 వేల కోట్ల ప్రాజెక్టుకు రూ.లక్షన్నర కోట్లా?: కేటీఆర్

“మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో డీపీఆర్ లేదని తెలిపారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలి. డీపీఆర్ తయారీని ‘మెయిన్ హార్ట్’ అనే కంపెనీకి అప్పగించారు. ఈ కంపెనీని సింగపూర్, పాకిస్థాన్, భారతదేశంలోని అనేక సంస్థలు నిషేధించాయి. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్‌నగర్‌కు నోటీసులు ఇచ్చారు. 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి 10,000కు పైగా ఇళ్లకు నోటీసులు ఇచ్చారు. ఏడీబీ రుణం ఇచ్చేది లేదు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు. ప్రణాళిక లేదు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రూ.లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం చెప్పాలి. సీఎం ఒకవైపు రూ.లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం మంత్రి రూ.నాలుగైదు వేల కోట్లు అని చెబుతున్నారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోం. ఉపముఖ్యమంత్రి భట్టి పేదలపై ప్రేమ వలకబోస్తున్నారు. సొంత జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కూల్చివేస్తున్నా ఆయన పట్టించుకోలేదు” అని కేటీఆర్ విమర్శించారు. ఎల్బీనగర్ భారాస ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలపై కక్షతో వ్యవహరిస్తోందని, బాధితులను సీఎం భయపెట్టడం దారుణమని అన్నారు.

**ఎట్టి పరిస్థితుల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తాం: శ్రీధర్‌బాబు**

“మూసీ ప్రాజెక్టు తొలి దశ డీపీఆర్ తయారైంది. అది 2025 జనవరిలో ప్రారంభమై, 2026 ఫిబ్రవరిలో పూర్తయింది. ప్రాజెక్టు తొలి దశకు రూ.6,500 కోట్ల నుంచి రూ.7,000 కోట్లు అవుతుందని అంచనా. మూసీకి రెండు వైపులా 50 మీటర్లను బఫర్ జోన్‌గా గుర్తిస్తూ 2016లో భారాస ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే ముందుకెళ్తున్నాం. తుది ఎన్యూమరేషన్ కొనసాగుతోంది. సుమారు 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. బఫర్‌జోన్‌లో ఉన్నవారికి టీడీఆర్ ఇస్తాం. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం కల్పిస్తాం. మూసీ ప్రాజెక్టు కోసం డీపీఆర్ రూపొందించిన సింగపూర్ ఇంజనీరింగ్ సంస్థ మెయిన్‌హార్ట్‌కు అంతర్జాతీయంగా పేరుంది. మూసీ ప్రాజెక్టుకు రుణం కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకుకు డీపీఆర్ పంపించాం. త్వరలోనే దానికి ఆమోదం లభిస్తుందని భావిస్తున్నాం. ఏడీబీకి వీలుకాకపోతే ప్రపంచ బ్యాంకు లేదా ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేస్తాం. సభలో భారాస వైఖరి సరిగా లేదు. మూసీ విషయంలో ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదు. రూ.లక్షన్నర కోట్ల కుంభకోణం అని అవాస్తవాలతో వారు ప్రజలను తప్పుదోవ పట్టించి, బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు” అని శ్రీధర్‌బాబు వివరించారు.

**పేదల జీవితాలను మారుస్తాం: భట్టి విక్రమార్క**

“మూసీ పునరుజ్జీవం ఒక సామాజిక బాధ్యత. మురుగు నీరు, ఈగలు, దోమలు, రోగాల మధ్య దయనీయ పరిస్థితుల్లో బతుకుతున్న పేదల జీవితాలను మార్చాలనేదే మా ప్రభుత్వ సంకల్పం. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్న వారు పేదలు అదే మురికి కూపంలో ఉండాలని కోరుకుంటున్నారా? నివాసాలు కోల్పోయే ప్రతి పేద కుటుంబానికి పట్టా ఉన్నా లేకపోయినా అదే ప్రాంతంలో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే స్పష్టంచేశారు. అదీగాక అక్కడి మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తాం. వారి పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మించి ఉజ్వల భవిష్యత్తును అందిస్తాం. పేదవాడు పేదవాడిగానే ఉండాలి, మురికిలోనే బతకాలి అనే ధోరణిని ప్రతిపక్ష పార్టీ నాయకులు వీడాలి..” అని భట్టి అన్నారు. మూసీ కోసం భారాస హయాంలో ప్రణాళికలు రూపొందించి, ఇప్పుడు పేదలను రెచ్చగొట్టడం సరికాదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. భారాస హయాంలో నిర్మించిన ట్రాక్ వరదలకు కొట్టుకుపోయిందని విమర్శించారు.

వెలుగుమట్లపై చర్చకు రావాలి: ‘వెలుగుమట్లపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దమ్ముంటే చర్చకు రావాలి’ అని వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు సవాలు విసిరారు. అసలు విషయాలన్నీ తెలిస్తే కేటీఆర్ సభలో కూర్చోవడానికి కూడా సిగ్గుపడాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు.




మాట్లాడుతున్న కోదండ రెడ్డి

# కూరగాయల సాగుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి తోడ్పాటు

**తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదం డరెడ్డి**


**బుద్వేల్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**



తెలంగాణ రాష్ట్రంలో కూరగాయల సాగును భారీగా పెంపోం దించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయి తోడ్పాటు ఉందని, రైతులు తమ ఉత్పత్తులకు మేలైన గిట్టుబాటు ధరలు పొందేందుకు రైతులకు అందుబాటులోనే గ్రామాలలో మార్కెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బుధవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆరు జిల్లాల నుంచి వచ్చిన 150 మంది వెజిటేబుల్ వాలంటీర్ రైతులకు కూరగాయల సాగుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోదండ రెడ్డి మాట్లాడుతూ, రైతులే క్షేత్ర స్థాయిలో శాస్త్రవేత్తలని, కూరగాయల విస్తీర్ణం పెంపు బాధ్యతలను రైతులు తమ భుజ స్కంధాలపై వేసుకుని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. తెలంగాణ లో సాలీనీ వర్షాపాతం 900 మిల్లీ మీటర్లు ఉ ందని, ఈ వాతావరణం కూరగాయల సాగుకు అత్యంత అనుకూలమని ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ భగవాన్, ఉన్నతాధికారులు డాక్టర్ లక్ష్మీనారాయణ. డాక్టర్ సురేశ్ కుమార్, డాక్టర్ అనిత కుమారి, ఉద్యానశాఖ అడిషనల్ డైరెక్టర్ రాజ్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఉద్యోగి అదృశ్యం


**బుద్వేల్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**



విష్ణుకాంత్ మార్కండేయ

శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీ లో నివాసం ఉండే విష్ణుకాంత్ మార్కండేయ (32) అదృశ్యమైనాడు. ప్రైవేటు ఉద్యోగం చేసుకునే ఇతను ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించకుండ పోయాడు. అతని కోసం కుటుంబ సభ్యులు ఎంత వెదికిన ఫలితం కనిపించలేదు. దీంతో సోదరుడు అమర్ చంద్ ఈ నెల 15న రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ రాజ్ కుమార్ ధర్యాప్తు చేస్తున్నారు.





పోలీసు బందోబస్తు మధ్య కబ్జా అయిన స్థలాన్ని కాపాడిన హైడ్రా

# శాస్త్రీపురంలో 924 గజాల ప్రభుత్వ స్థలం ను కాపాడిన హైడ్రా

**బుద్వేల్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

శాస్త్రీపురం సర్వే నెంబరు 134/20 లో కబ్జా కు గురైన 924 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు తో కబ్జా అయిన పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకున్న హైడ్రా ఆ స్థలంలో చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. హైడ్రా సిబ్బంది తో పాటు మైలార్దేవుపల్లి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎవరైన కబ్జాలకు పాల్పడితే హైడ్రా కు ఫిర్యాదు చేయాలని, హైడ్రా ఆ స్థలాలను కాపాడుతుందని అధికారులు తెలిపారు.

# తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు 2029లోనే

మొదటి పేజీ తరువాయి...

పైవిధంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్లు ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చినా తెలం గాణలో అసెంబ్లీ ఎన్నికలు మాత్రం 2029లోనే జరుగుతా యని, అందువల్ల ఈ రిజర్వేషన్లతో తమకేమీ ఇబ్బంది ఉం డదన్నారు. రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన మిత్రుడు వేం నరేం దర్‌రెడ్డిని వెంటబెట్టుకొని సీఎం బుధవారం ఉదయం పార్లమెంటుకు వచ్చి అక్కడ రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలకు ఆయన్ను పరిచయంచేసి మాట్లాడారు. అనంతరం విలేకర్లు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కొందరు వ్యక్తులకు స్టేషన్ బెయిల్ ఇవ్వడం గురించి స్పందిస్తూ ఆ విషయంలో నిబంధనల ప్రకారమే పోలీసులు నడుచుకున్నారని, అందులో ఎవ్వరికీ ఎలాంటి ప్రమేయం ఉండదన్నారు.

# చిరుధాన్యాల ఉత్పత్తి, ఆహార ప్రాసెసింగ్‌లో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ (శ్రీ అన్న) చేస్తున్న కృషి అభినందనీయం




చిరు ధాన్యాల పంటల బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ తారా సత్యవతి తదితరులు




అవగాహన ఒప్పందం

**బుద్వేల్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

ప్రపంచ ప్రజలకు మిల్లెట్స్ తో తయారయ్యే ఆహార పదార్థాలను అందించడంతో పాటు, చిరుధాన్యాల రైతుల జీవితాలలో వెలుగులునింపడానికి రాజేం ద్రనగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ అందజేస్తున్న కార్యక్రమాలు అద్భుతమని భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (ఫుడ్ అండ్ ఫొడర్ (క్రాప్స్) డాక్టర్ ఎస్ కె ప్రధాన్ అన్నారు. రాజేంద్రనగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్) లో గల గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ (శ్రీ అన్న) 3వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ లో జరిగిన వర్క్ షాప్ లో డాక్టర్ ఎస్ కె ప్రధాన వర్చ్యువల్ విధానంలో మాట్లాడారు. చిరుధాన్యాలపై దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న ఫార్మర్స్ ప్రొడ్యుసింగ్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ పి ఓ) లను బలోపేతం చేసి వారి ద్వారా చిరుధాన్యాల రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ఐఐఎంఆర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వర్చువల్ విధానంలో మాట్లాడిన ఐసీఏఆర్ అసిస్టెం ట్ డైరెక్టర్ జనరల్ (ఆయిల్ సీడ్స్ అండ్ పల్సెస్) డాక్టర్ సంజీవ్ గుప్తా మాట్లాడుతూ, ఐఐఎంఆర్ పై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎంతో భారం పెట్టారని, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2023లో ఐఐఎంఆర్ లో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ (శ్రీ అన్న) ను ఏర్పాటు చేశారన్నారు. దాని ద్వారా విత్తన వ్యవస్థలు, పరిశోధన పురోగతులు, దేశ వ్యాప్తంగా చిరుధాన్యాల సాంకేతికతలను సమర్థవంతంగా వ్యాప్తి చేయడంలో ఐఐఎంఆర్ చేస్తున్న కృషి అభినం దనీయంగా ఉందన్నారు. వర్క్షాప్ కు గౌరవ అతిథిగా హాజరైన ఐసీఐసీఐ ఫౌండేషన్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ (డిజిటలైజేషన్) అభయ్ శర్మ మాట్లాడుతూ, చిరుధాన్యాల పరిశోధనల ద్వారా ఐఐఎంఆర్ ఎన్నో కొత్త కొత్త ఆహార పదార్థాలను కనుగొనడంలో విజయం సాధించిందన్నారు. మ్యాగి స్థానంలో మిల్లెట్ నూడుల్స్, మిల్లెట్ రోటి లాంటి అనేక కొత్త కొత్త ఆవిష్కరణలు రావడం శుభ పరిణామమన్నారు. వర్క్షాప్ లో గౌవర అతిథిగా పాల్గొన్న రైతునేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పద్మశ్రీ డాక్టర్ వై. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, రైతు నేస్తం ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రోత్సహించడానికి, ప్రజలకు చిరు ధాన్యాల అహారం తీసుకుంటే కలిగే ఆరోగ్య లాభాలను వివరించడానికి వందలాది అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. చిరుధాన్యాల పంటలు పండించడం వల్ల నేల సారవంతంగా ఉంటుందని, పర్యావరణానికి ఎలాంటి హాని కలుగదని, నీటి అవసరత కూడా తక్కువగా ఉంటుందన్నారు. వరికి మాదిరిగా చిరుధాన్యాలు పండించే రైతులకు కూడా క్వింటాళ్లుకు రూ. 500 బోనస్ ఇస్తే ఈ పంటలు మరింత ఎక్కువ పండించే అవకాశం ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఇచ్చే చిరుధాన్యాల పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఐఐఎంఆర్ డెరె క్టర్ డాక్టర్ తారా సత్యవతి మాట్లాడుతూ, మూడు సంవత్సరాల కాలంలో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ (శ్రీ అన్న) ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను, పథకాలను వివరించారు. సంస్థలో విశేష కృషి చేస్తున్న శాస్త్రవేత్తలను, ఉద్యోగులను ఆమె ఈ సందర్భంగా అభినందిస్తు సర్టిఫికెట్లను అందజేశారు.

**వర్చువల్ విధానంలో శుభాకాంక్షలు తెలిపిన ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ :**

ఐఐఎంఆర్ గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ (శ్రీ అన్న) 3వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతు అటు రైతులకు, ఇటు ప్రజలకు ఆరోగ్యవంతమైన అహారపు ఉత్పత్తులను తయారు చేయడంలో ఐఐఎంఆర్ చేస్తున్న కృషి ని వర్చువల్ విధానంలో ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (క్రాప్ సైన్సెస్) డాక్టర్ డి.కె యాదవ లు అభినందించారు. కార్యక్రమంలో ఐఐఎంఆర్ ప్రిన్సిపల్ సైంటీస్ డాక్టర్ జి శ్యామ్ ప్రసాద్, డాక్టర్ ఆర్ మదుసూదన లు పాల్గొన్నారు.

## హైదర్‌గూడ డివిజన్‌లో రోడ్లు బాగు చేయాలి



రోడ్లు బాగుచేయాలని రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

**బుద్వేల్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

నూతనంగా ఏర్పాటైన హైదర్ గూడ డివిజన్ పరిధిలోని ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 179 నుంచి రాజేంద్రనగర్ కోర్టు ప్రాంగణం వరకు, ఉప్పర్ పల్లి శివాలయం నుం చి పిల్లర్ నెంబర్ 143 వరకు రోడ్లు అద్వాన్నంగా ఉన్నాయని బీజేపీ నారాయణపేట్ జిల్లా ఇంచార్జి బొక్క బాల్ రెడ్డి, గోల్కొండ గోషామహల్ జిల్లా ఇంచార్జి వై శ్రీధర్ లు అన్నారు. ఈ రోడ్డు బాగు చేయాలని కోరుతు బుధవారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉప్పర్ పల్లి నుంచి బాపుఘాట్ బ్రిడ్జికి వెళ్లే మార్గం కూడా అధ్వాన్నంగా ఉందన్నారు. వర్షం పడితే రోడ్లు చెరువుల్లా మారుతున్నాయన్నారు. మా డివిజన్ నుంచి పన్నులు ఎక్కువగా వసూలు అవుతున్నప్పటికి అభివృద్ధి పనులు మాత్రం సరిగ్గా చేయడం లేదన్నారు. జోనల్ కమిషనర్ కార్యాలయానికి వచ్చిన వారిలో బీజేపీ నాయకులు సులిగె విఠల్, సులిగె వెంకటేశ్, గుంజ బాబురావు, శ్రీకాంత్ రెడ్డి , వెంకట్ రెడ్డి, , రాకేశ్ గౌడ్, పవన్ కుమార్ యాదగిరిలు ఉన్నారు.



ఉప్పర్ పల్లి లో అధ్వాన్నంగా రోడ్డు









## భానోదయ హై స్కూల్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**బుద్వేల్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

రాంబాగ్ పాండురంగానగర్లోని భానోదయ హై స్కూల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ బి భాస్కర్ ప్రిన్సిపల్ బి భవానీల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. చిన్నారుల ఆటపాటలతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు సైన్స్ డే లో చిన్నారుల ప్రదర్శనలో ఆలోచింపచేసాయి అనంతరం ప్రైమరీ సెక్షన్లు విద్య పూర్తి చేసుకునే విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెర్మనీ నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ సంతోషిని బట్ అకాడమిక్ ఇంచార్జ్ ప్రైమరీ ఇంచార్జ్ ఎం మీనా, హై స్కూల్ ఇన్చార్జ్ ఎన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# హస్త కళల తయారీపై శిక్షణ

**బుద్వేల్ , మార్చి 18 (ప్రభాత ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిధిలోని సామాజిక విజ్ఞాన కళాశాల ఆధ్వర్యంలో వనరుల నిర్వహణ, వినియోగదారుల శాస్త్ర విభాగము సంయుక్తంగా వెదురుతో హస్తకళల తయారీ, అటవీ యేతర ఉత్పత్తుల ప్రాసెసింగ్ మీద నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు . ఈ నెల 13నుండి ఆరు రోజుల శిక్షణ నిర్వహించడం జరిగింది. ఈ ట్రైనింగ్ ముగింపు సమావేశము బుధవారం జరిగింది. ముగింపు సమావేశంలో అసోసియేట్ డీన్ డాక్టర్ వి విజయలక్ష్మి ,భారతీ నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డి, సురక్ష సేవా సంఘం అధ్యక్షుడు కే .గోపి శంకర్ యాదవ్, ప్రెసిడెంట్ ప్రశాంత్, శ్రీమతి సిహెచ్ స్నేహలత అసిస్టెంట్ ప్రొఫెసర్,ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్కి ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, శిక్షకుడు మహమ్మద్ మజార్, హారతి గ, తులసి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ వి విజయలక్ష్మి మట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న ల్యాంషేడ్ మరియు లాండ్రీ బాస్కెట్లను తయారు చేస్తూ వాటిని అమ్మి ఆర్థికంగా ఎదగవలసిందిగా సూచించారు. సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ మహిళల కోసమే తాను కట్టించిన ఈ ట్రైనింగ్ హాలు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించడానికి ఉపయోగపడినందుకు ఎంతో సంతోషంగా ఉంది అన్నారు .ఈ శిక్షణ కార్యక్రమం చాలా ఉపయోగకరమైందని అన్నారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాము భారతీ నగర్, వార్డ్ ఆఫీసు, ట్రైనింగ్ సెంటర్ ఎల్ఐ జి కాలనీ, బిహెచ్ఇఎల్ ,సంగారెడ్డి జిల్లాలో జరిగింది .ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కు ఆర్థికంగా సహాయం అందించిన వారు తెలంగాణ రాష్ట్ర విజ్ఞాన మరియు టెక్నాలజీ మండలి (టీజీ కాస్ట్ ) సైన్స్ అండ్ టెక్నాలజీ తెలంగాణ ప్రభుత్వం.



శిక్షణ లో పాల్గొన్న మహిళలు




రాజేంద్రనగర్ తహసిల్దార్ బొమ్మ రాములు కు వినతి పత్రం అందచేస్తున్న బీజేపీ నాయకులు

## ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి : బీజేపీ

**బుద్వేల్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ, రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల కు చెందిన బీజేపీ నాయకులు బుధవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ బొమ్మ రాములు కు వినతి పత్రం అందజేసి ప్రభుత్వానికి మా డిమాండ్ ను తెలియచేయాలని కోరారు. నిరుద్యోగ యువత కు ఉద్యోగాల కోసం జాబ్ క్యాలెండర్ను అమలు చేయాలన్నారు. నిరుద్యోగ బృతి ని ఇవ్వాలన్నారు. వృద్ధులకు, వితంతువులకు వికలాంగులకు పెంచుతామన్న పించన్లు పెంచాలన్నారు. కొత్త వారికి ఫించన్లు ఇవ్వాలన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం ఇసా బిబిమన్నారని, దానిని ఇవ్వాలన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని, రైతు భరోసా ను వెం టనే వేయాలన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో ప్రజలు వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ గోల్కొం డ ఇంచార్జి వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎన్ మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి ఇంచార్జి బొక్క బాల్ రెడ్డి , బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పొన్నమోని మల్లేశ్ యాదవ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్, సీనియర్ నాయకులు అడికె రాజు, షాబాద విజ కుమార్,కె హరికిషన్, అడికె మహేందర్, సులిగె విఠల్, పసుపుల సందీప్ ముదిరాజ్, జి బాబురావు, సూరెడ్డి రాజశేఖర్ రెడ్డి, సూరెడ్డి వినయ్ రెడ్డి, రావుల భాస్కర్, రాజు పహిల్వాన్, సరితారెడ్డి, కవిత, పద్మావతి, రాకేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




అతిథులకు సన్మానం

## పని ప్రదేశంలో భద్రత అవసరం

**బుద్వేల్, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

ఉద్యోగ నిర్వాహణ లో లైంగిక వేదింపుల నివారణ (ఫోష్) కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పని ప్రదేశంలో భద్రత, సమానత్వం అనే అంశంపై వక్తలు ప్రసం గించారు. లింగ సమానత్వం, సురక్షితమైన పని వాతావరణం కల్పించాల్సిన అవసరాలపై వివరించారు. ఉద్యోగులు తమ హక్కులు, బాధ్యతల గురించి తెలుసుకుని ముందుకు సాగాలన్నారు. పోష్ చట్టం 2013 గురించి వివరంగా వివరించారు. లైంగిక వేదింపులు లేకుండ ప్రతి సంస్థలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో త్రినేత్ర ఫౌండేషన్ కు చెందిన భారతి కలవగుంట, ప్రకృతి పర్యావరణ సంఘం సీఈఓ మూగ జయశ్రీ, పోష్ కమిటీ ఛైర్పర్సన్ డాక్టర్ పి సి లత, ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం తదితరులు పాల్గొన్నారు.




## హై టెన్షన్ రోడ్డులో నిర్మించిన శిల్ప బృందావనం గేట్లను వెంటనే తొలగించాలి

### నిరసన చేపట్టిన శంషీగూడ ప్రజలు

**కూకట్ పల్లి, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి మున్సిపల్ ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని శంషీ గూడ కు చెందిన ప్రజలు బుధవారం శిల్ప బృందావనం గేటు ముందు నిరసన వ్యక్తం చేశారు. ప్రగతి నగర్ లోని ప్రణీత్ ఆంటీలియా తరహాలో శంషీగూడలో శిల్పా బృందావనం, సాయి హిల్స్ వాసులు కూడా రహదారిని కబ్జా చేసి గేట్లను ఏర్పాటు చేసరని ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజలు రోడ్డెక్కారు. ఈ శంషీ గూడా గ్రామ ప్రజలు మాట్లాడుతూ శనివారం, ఆదివారాలు వస్తే శంషీ గూడ నుండి ఎల్లమ్మబండ కు వెళ్లడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుందని ఆరోపించారు. శిల్ప బృందావన్ నివాసాలు అన్ని హెచ్ఎండిఏ లేఔట్ తో ఏర్పాటుచేసి గేటెడ్ కమ్యూనిటీ అంటూ రహదారిని మూసివేసారని అన్నారు. అదేవిధంగా సాయి హిల్స్ వాసులు కూడా రోడ్డు పై గోడ నిర్మాణం చేపట్టడం పైన ఇప్పటికే డిప్యూటీ కమిషనకు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. తమకు స్పీకింగ్ ఆర్డర్లలో తోపాటు వీటిని తొలగించాలని ఆదేశాలు ఉన్న ఎవరూ పట్టించుకోకపోవడంతో హైడ్రా కమీషనర్ రంగనాథ్ ను సైతం ఆశ్రయించి ఫిర్యాదు చేశామని తెలిపారు. వీటి పైన విచారణ జరిపి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు స్పందించి ఈ రోడ్డును ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని దీని ద్వారా మియాపూర్ నుండి వచ్చేవారు నేరుగా గాజులరామారం వెళ్లేందుకు వీలు ఉంటుందని తెలిపారు. శిల్ప బృందావన్ లో ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఆలయానికి భక్తులు రాకుండా సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ధర్మకర్తగా వ్యవహరిస్తూ ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నాడని ఆరోపించారు. లోపల ఉన్న పార్కును సైతం అభివృద్ధి చేసి కాలనీవాసులు అందరికీ ఉపయోగపడేలా చూడాలని అన్నారు. గేట్లు ఏర్పాటుచేసి లోపల జరిగే తతంగం పైన ప్రభుత్వం విచారణ చేపట్టి వీటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దార్గుపల్లి గోపాల్, దార్గుపల్లి సురేందర్, సుధాకర్, ప్రభాకర్, శ్యామ్ రావు, లింగం, కె.సత్యనారాయణ, భీమ్ రావు , గణేష్, కృష్ణ, జె. ప్రభాకర్, ఎం.దర్శన్, డి ప్రభాకర్, ఎం.రమేష్, కె పోచయ్య, జె.కిరణ్, కె రవి అధిక సంఖ్యలో మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

### 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా

# బాలానగర్ పోలీసుల అవగాహన కార్యక్రమం..!





**యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి తమ ఉజ్వల భవిష్యత్తును కాపాడుకోవాలి**

**ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి, బాలానగర్ సీఐ నర్సింహా రాజు**

**కూకట్ పల్లి, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో 'సైబర్ క్రైమ్ - మాదక ద్రవ్యాల దుర్వినియోగం' పై అవగాహన కార్యక్రమం బాలానగర్ పరధిలోని విజన్ మోడల్ హై స్కూల్ లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు డ్రగ్స్ యువత జీవితాన్ని నాశనం చేస్తాయని మత్తుకు బానిసలైతే నేరాలు, ఆకృత్యాలకు దారి తీస్తాయని ఏసీపీ అన్నారు. మాదకద్రవేయులకు దూరంగా ఉండి తమ ఉజ్వల భవిష్యత్తును సంరక్షించుకోవాలని అయన సూచించారు. యువతకు ఎంతో భవిష్యత్తు ఉందని ఈ క్రమంలో ప్రస్తుత సమాజంలో ఎంతో అప్రమత్తతగా ఉండి విద్యపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, తల్లిదండ్రులకు గురువులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఏసీపీ నరేష్ రెడ్డి సూచించారు. అనంతరం బాలానగర్ సీఐ నర్సింహా రాజు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం సామాజిక, మానసిక, శారీరక సమస్యలకు దారితీస్తుందని మత్తుపదార్థాలు సమాజంలో వినాశకరమైన ప్రభావాన్ని చూపుతున్నాయని, వాటి నిర్మూలన కోసం ప్రతీ ఒక్కరూ పాటుపడాలని సీఐ రాజు సూచించారు. మాదకద్రవ్య రహిత సమాజం కోసం సైబరాబాద్ పోలీసులు చేపడుతున్న కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల సంరక్షణ చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, చైల్డ్ రైట్స్, పోక్సో చట్టాల గురించి, విద్యార్థుల పై సోషల్ మీడియా ప్రభావం ఏ విధంగా ఉంటుందో సూచించారు. తదుపరి బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం తప్పనిసరని, ఇది ప్రమాద సమయాల్లో తలకు తీవ్రమైన గాయాలు కాకుండా, మెదడు దెబ్బతినకుండా రక్షిస్తుందని, హెల్మెట్ ధరించడం వల్ల మరణ ప్రమాదాన్ని 63-88% వరకు తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఇది కేవలం చట్టపరమైన నియమం మాత్రమే కాదని, మీ కుటుంబ భద్రతకు బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజన్ మోడల్ హై స్కూల్ కరెస్పాండెంట్ రాజేష్ బాబు, బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, డిఐ సక్రమ్, ఎస్ఐలు సరితా రెడ్డి, హాజీ మియా, స్థానిక నాయకులు పులి శివ కుమార్ గౌడ్, సదా గౌడ్, శ్రీకాంత్ గౌడ్, స్కూల్ టీచర్స్, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం

**పటాన్ చెరు, మార్చి 18 (ప్రభాత ఉదయం) :**

బొల్లారం డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్'లో నివసించే అంకుష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల నుంచి విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి తన బృందంతో బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పేద కుటుంబానికి అండగా నిలుస్తూ బృందం సభ్యులతో కలిసి యాబై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకి అందించి పెద్ద మనసు చాటుకున్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న పేద కుటుంబానికి ఆర్థిక భరోసాను కల్పించిన నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం.పీ.టీ.సీ కృష్ణంరాజు, నాయకులు దీనానాద్, రాజారామ్, మాజీ వార్డు సభ్యుడు భాస్కర్, కార్మిక నాయకులు లక్కన్ సింగ్, సతీష్, ఉద్యానంద్, ఉమాకాంత్, శ్రీరామ్ తివారి, ధర్మేందర్ , జితేందర్, మనోజ్ , బాధిత కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు చేస్తున్న శ్రీ రమ్య ఇండస్ట్రీస్ అధినేత రాజశేఖర్ రెడ్డి

## పాగుంటా వెంకన్న సన్నిధిలో...కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీరమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు

**జిల్లా ప్రజలకు శ్రీ పరాభవనామ ఉగాధి శుభాకాంక్షలు తెలియజేత**

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి18(ప్రభాత ఉదయం)**

అమావాస్య సందర్భంగా వెంకటాపురంలో వెలసిన పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సన్మానించారు. అమావాస్య సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాని నిర్వహించారు. నూతన తెలుగు సంవత్సర సందర్భంగా జిల్లా ప్రజలకు, రైతన్నలకు శ్రీపరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బండ్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... తెలుగు నూతన సంవత్సరాన్ని కృషి, నిబద్ధతతో ఆహ్వానిద్దామని, రాబోయే పరాభవ నామ సంవత్సరం.. మనందరి అభ్యున్నతి సంవత్సరంగా మారుతుందని ఆకాంక్షించారు. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలి అని ఆయన ఆకాంక్షించారు. సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని అభిలాషించారు. ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాల్లో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పండగ అన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో.. ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయన వెంటా ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, నాయకులు తదితరులు ఉన్నారు.




## జిల్లాలో వడగండ్ల వానలు

**దెబ్బతిన్న కూరగాయలు, మొక్కజొన్న, వరి, మామిడి**

**గద్వాల ప్రతినిధి,మార్చి18(ప్రభాత ఉదయం)**



ద్రోణి ప్రభావంతో జోగులాంబ గద్వాల జిల్లాలో మంగళ, బుధ వారాలలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురవగా, మరికొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, తేలికపాటి వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. మంగళవారం రాత్రి జిల్లాలోని పలు మండలాలో ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. మామిడి తోటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షంతో కొన్నిచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. మంగళవారం రాత్రి, బుధవారం సాయంత్రం గట్టు, అయిజ మండలాలో వడగండ్లు కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చేతికొచ్చిన మొక్కజొన్న, వరి, మామిడి పంటలకు కూడా నష్టం వాటిల్లినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలి దుమారం కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం కలిగింది. పలు గ్రామాల్లో కరెంటు సమస్యలు తలెత్తాయి. రాత్రి వేళల్లో చీకట్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చేతికి వచ్చిన వరి, మామిడి, మిర్చి తోటలు ఈదురుగాలలు ధాటికి దెబ్బతిన్నాయి. ఇప్పటికే పలు కొనుగోలు కేంద్రాల్లో పోసిన మొక్క జొన్న ఈ వర్షానికి తడిసిముద్దయింది. ముందస్తు హెచ్చరిక లేకపోవడంతో ఇటుక బట్టీ వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. కాల్చడానికి సిద్ధంగా ఉన్న ఇటుక రాళ్లు వర్షానికి పనికిరాకుండా పోయాయని, ఒక్క రాత్రిలోనే లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.




## తండ్రి మరణం... కన్నీటితో పది పరీక్ష రాసిన కొడుకు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 18 (ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లాలో హృదయ విదారక సంఘటన వెలుగులోకి వచ్చింది. కేటిదొడ్డి మండలం విశ్వబ్రహ్మణ మండలాధ్యక్షులు, గంగన్ పల్లి గ్రామానికి చెందిన సదానందం అచారి(44) మంగళవారం సాయంత్రం గద్వాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం ఆయన పార్థీవ దేహానికి అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఈ దు:ఖాన్ని దిగమింగుకొని పాతపాలెం జడ్పీహెచ్ఎస్ లో పదో తరగతి చదువుతున్న సాయివిష్ణు తండ్రి మరణంతో పుట్టెడు దుఖంలో ఉన్న కుమారుడు తన లక్ష్యాన్ని వీడకుండా బుధవారం నిర్వహించిన పదో తరగతి వార్షిక హిందీ పరీక్షకు హాజరయ్యాడు. ఈ విషాదకర సంఘటన ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. తండ్రి మరణించిన పుట్టెడు దు:ఖంలో కూడా, తన భవిష్యత్తు కోసం కన్నీళ్లతో పరీక్షా కేంద్రానికి వచ్చిన ఆ విద్యార్థి.. తన సహచర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఎంఈఓ విజయభాస్కర్, ఉపాధ్యాయులు, స్థానికులు తెలిపారు.



## పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారికి తులం బంగారం వితరణ చేసిన కర్ణాటక భక్తులు

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి18(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రాయచూర్ జిల్లా కురుతిప్ల గ్రామానికి చెందిన హరినారాణ రెడ్డి, దివ్యవాణి, రిదీర భక్తులు తులం బంగారం వితరణ చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రీపరాభవ నామ సంవత్సర అమావస్యను పురస్కరించుకుని బుధవారం దాతలు శ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలను ఆలయ నిర్వాహకులు, అర్చకులు శేషవస్త్రాలతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## అవి గద్దర్ అవార్డ్స్ కాదు ఖద్దర్ అవార్డ్స్

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 18(ప్రభాత ఉదయం)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ కవి, విప్లవ గాయకులు గద్దర్ పేరిట అవార్డ్స్ ఇస్తున్న అవి గద్దర్ అవార్డ్స్ కాదు ఖద్దర్ అవార్డ్స్ గా మారాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా బుధవారం విమర్శలు చేశారు."రాజ్యమేది లేదు గాని రాణిలాగా చూసుకుంటా" "కోట కట్టలేను గాని కళ్ళలో నిన్నే దాచుకుంటా" అనే పాట వల్లే రాజు వెడ్స్ రాంబాయి సినిమా హిట్ అయిందని, ఆ సినిమాకి గద్దర్ అవార్డు ప్రకటించి, సినిమాలోని ఐదుగురు ఆంధ్ర వాళ్ళకే ఇచ్చారన్నారు. కాని అ పాట రాసిన తెలంగాణ ఉద్యమకారుడు, విప్లవ వాది, దళిత వాది మిట్టపల్లి సురేందర్‌కు, అ సినిమా హీరోకు అవార్డు ఇవ్వలేదని, ఇక్కడ కూడ కులం, ప్రాంతం, బలం చూసారని, రాష్ట్ర ప్రభుత్వ పని తీరు పైన విమర్శలు చేశారు.




## గ్యాస్ వినియోగదారులు నిబంధనలు పాటించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి18(ప్రభాత ఉదయం)**

గృహ అవసరాలకు గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకునే వినియోగదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గ్యాస్ సిలిండర్ల కొరత, బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు అంటూ కొన్ని మీడియాల్లో వస్తున్న వార్తల నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర, ధనుష్ హెచ్.పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్యాస్ సిలిండర్ల సరఫరా పై అక్కడి యాజమాన్యంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ బుకింగ్, సరఫరా ప్రక్రియలో ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనల ప్రకారం ప్రతి సిలిండర్ బుకింగ్‌కు మధ్య 45 రోజుల గ్యాప్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ గడువు పూర్తికాకముందు మళ్లీ బుకింగ్ చేయడానికి ప్రయత్నిస్తే ఓటిపి నంబర్ రాదని, కాబట్టి ప్రజలు అనవసరంగా గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్దకు రావద్దని సూచించారు. గృహ అవసరాలకు గ్యాస్ బుకింగ్ సంబంధించి గతంలో వచ్చిన మెసేజ్లో ఉన్న తదుపరి బుకింగ్ తేదీ చూసుకుని ఆ తేదీకి మాత్రమే బుకింగ్ చేయాలని, గ్యాస్ బుక్ చేసిన వారికి సంబంధిత గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది నిర్దేశిత సమయంలోగా వినియోగదారుల ఇంటి వద్దకే వచ్చి సిలిండర్లను సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్ద గందరగోళం నివారించేందుకు ఓటిపి వచ్చిన వారికి ఒక లైన్ ఏర్పాటు చేసి సిలిండర్లను సరఫరా చేయాలన్నారు. అలాగే ఓటిపి రాని వారికి అవసరమైన సమాచారాన్ని అందించేందుకు ప్రతి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ హెల్ప్ డెస్క్ వద్ద వినియోగదారులకు బుకింగ్ స్టేటస్, ఓటిపి సమాచారం, తదుపరి బుకింగ్ తేదీ, తదితర వివరాలను అందించాలన్నారు.గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి నిర్దేశిత గ్యాస్ బుక్ లోని కన్స్యూమర్ నెంబర్ తో రిజిస్టర్ అయిన మొబైల్ నెంబర్ నుంచే వినియోగదారులకు ఓటిపి వస్తుందని, మొబైల్ నెంబర్ మార్పులు అనుమతించబడవని తెలిపారు. ఇది బ్లాక్ మార్కెటింగ్ నివారణ కోసం తీసుకున్న చర్యగా పేర్కొన్నారు. ప్రతి గ్యాస్ సిలిండర్‌కు ప్రత్యేక సీరియల్ నెంబర్ ఉంటుందని, సిలిండర్ దుర్వినియోగం లేదా ఇతరులకు మళ్లింపు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత వినియోగదారుడు మళ్లీ గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్నప్పుడు డెలివరీ సమయంలో ఇదివరకు ఇచ్చిన సిలిండర్ ను నంబర్ సరిచూసుకుని గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకునే వారిపై అవసరమైతే పోలీస్ కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జోగులాంబ గద్వాల జిల్లాలో 11 ఏజెన్సీల పరిధిలో గృహ అవసరాలకు సంబంధించి 1,76,366 , వాణిజ్య అవసరాలకు సంబంధించి 907 గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు 2815 గృహ అవసరాల గ్యాస్ బుకింగ్ లు జరుగుతున్నట్లు చెప్పారు. జిల్లాకు రోజుకు సుమారు 5000 గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయని, గ్యాస్ కొరత ఎక్కడా లేదని స్పష్టం చేశారు. ప్రజలు భవిష్యత్తులో గ్యాస్ కొరత రావచ్చేమోనని అనుమానాలతో ముందుగానే బుక్ చేసుకోవడం వలన ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు సిలిండర్ల కోసం బారులు తీరాల్సి వస్తుందని పేర్కొన్నారు. వినియోగదారులు అపోహలను వీడి అనవసరంగా భయపడకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయంలోనే గ్యాస్ సిలిండర్ ల కోసం బుకింగ్ చేసుకోవాలని కలెక్టర్ కోరారు.గ్యాస్ సిలిండర్ల బుకింగ్ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో సమగ్ర వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వినియోగదారులకు ప్రతి రోజు గ్యాస్ సిలిండర్ల సరఫరా, బుకింగ్స్, ఫిర్యాదులపై నివేదికలు సమర్పించాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ నది అగ్రహారం వద్ద ఉన్న ధనుష్ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ గోదామును సందర్శించారు. కేజీబీవీలు, గురుకులాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు సిలిండర్ల కొరత లేకుండా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, ఆయా గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, తదితరులున్నారు.

# ఇండ్లు పొందిన లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇండ్లలో తప్పకుండ నివసించాలి: జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,మార్చి18(ప్రభాత ఉదయం)**

ఇండ్లు పొందిన లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇండ్లలో తప్పకుండ నివసించాలి.పూర్తి అయిన నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించాలి.2 బిహెచ్కే ఇండ్లు తీసుకున్న ఇంకా వాటిల్లో నివసించని వారికి కేటాయించిన ఇండ్లను నోటీస్ ఇచ్చి రద్దు (ఝఅఎవశ్రీ) చేయండి.గడువులోపు (మార్చి 31లోపు) లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరం నుండి హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పూర్తి అయిన, నిర్మాణ దశలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని తెలిపారు. సంబంధిత ఆర్డీఓలు, డిప్యూటీ కమిషనర్లు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్2 లిస్ట్ నుండి పేదవారిని ఎంపిక చేయాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీల సహాయంతో ఎంపిక చేసిన లిస్ట్ ను జిల్లా మంత్రి గారి ఆమోదం తీసుకొని గజిటెడ్ ఆఫీసర్ ద్వారా ధృవీకరణ చేసి మంజూరు చేస్తారని తెలిపారు.డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండని లబ్ధిదారులందరు ఈ నెల 31వ తేదీ వరకు తమకు కేటాయించిన ఇండ్లలో నివసించాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే వ్రాతపూర్వకంగా తెలియజేయాలని, లేని యెడల ఏప్రిల్ మొదటి వారంలో వారికి కేటాయించిన ఇండ్లను రద్దు చేసి కొత్త వారికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అన్నీ హౌసింగ్ కాలనీలలో అవసరమైన మౌలిక సదుపాయాలైన




విద్యుత్ సరఫరా, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, పరిశుధ్యం పనులు చేపట్టాలని సంబంధిత విద్యుత్, జలమండలి , మిషన్ భగీరథ అధికారులకు సూచించారు.ఇప్పటి వరకు వచ్చిన ఎల్2 లిస్ట్ ఇంకా మిగిలి ఉంటే దగ్గరలో ఉన్న ఎకరం కంటే ఎక్కువ ఉన్న స్థలాలను గుర్తించి మంజురి నిమిత్తం ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా డబల్ బెడ్ రూమ్ ల కాలనీలలో ఉన్న దుకాణాలను వేలం వేయడం జరుగుతుందని, వేలం వేయడం ద్వారా వచ్చిన మొత్తాన్ని కాలనీల అభివృద్ధి నిమిత్తం ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు.సంబంధిత అధికారులందరూ నిర్లక్ష్య ధోరణి అవలంభించకుండా పూర్తి బాధ్యతో పని చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని సమన్వయంతో సమిష్టిగా పని చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్, జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.చాంప్లా నాయక్, ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సరిత, పార్థసింహ రెడ్డి, తహసీల్దార్లు, హౌసింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు




### బాల్యవివాహాలకు వ్యతిరేకంగా

## విద్యార్థులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి18(ప్రభాత ఉదయం)**


గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జిల్లా మహిళ సాధికారత సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు హాజరై మాట్లాడారు. బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు మరియు వాటిని అరికట్టాల్సిన అవసరాన్ని విద్యార్థినులకు వివరించారు. సమాజంలో బాల్యవివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. మీనాక్షి మాట్లాడుతూ విద్యార్థినులు తమ విద్యను కొనసాగిస్తూ, బాల్యవివాహాలకు వ్యతిరేకంగాగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈకో క్లబ్ కన్వీనర్ ఎం దేవుజా , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బిమ జగన్ మోహన్ , డబ్ల్యూ ఇసి కన్వీనర్ ఎం. సమత మరియు అధ్యాపకులు సురేష్ బాబు, విద్యార్థినిలు అధ్యాపకులు పాల్గొన్నారు.



## ఆలయాలకు పోటెత్తిన భక్తులు

**కేటిదొడ్డి, మార్చి18(ప్రభాత ఉదయం)**

అమావాస్య సందర్భంగా కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి బుధవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అఖండ భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.




**కన్నుల పండువగా స్వామీ వారి కళ్యాణోత్సవం**

అమావాస్య సందర్భంగా పాగుంటా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా కొనసాగింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అభి షేకం, దీక్షా హోమం, శాంతిహోమం, పూర్ణాహుతి, చక్ర స్నానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంత రం అలివేల మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రథోత్సవ కార్యక్రమాని నిర్వహించారు.

# జనగామ నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో గళం మెత్తిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 18 (ప్రభాత ఉదయం) :**

తెలంగాణ రాష్ట్రము లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన, డిసెంబర్ 2023 నుంచి ఇప్పటి వరకు జనగామ నియోజకవర్గంలో రోడ్ల పనులు పూర్తిగా నిలిచిపోయాని, ఎంఆర్ఆర్, సీఆర్ఆర్, పంచాయతీ రాజ్, హ్యామ్, ఆర్ అండ్ బి రోడ్లకు మూరడు మట్టి కూడా వేయలేదని, గజం రోడ్డు వేయలేదని బుధవారం అసెంబ్లీ సాక్షిగా జనగామ నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటుగా విమర్శలు చేశారు. నియోజకవర్గంలో 131 గ్రామాలు, 2 పట్టణాలు, 42 వార్డులు ఉన్న ప్పటికీ అభివృద్ధి లేదని, జనగామ ప్రాంతంలో బస్సుల కొరత సమస్య తీవ్రంగా ఉందని, రోజుకు కేవలం 2 ట్రిప్పులు మాత్రమే నడుస్తున్నాయని, జనగామ, హుస్నాబాద్, హైదరాబాద్ తో పాటు పలు డిపోల వద్ద కొత్త బస్సులు కోరితే రోడ్లు బాగాలేవని అధికారులు నిరాకరిస్తున్నారు. హుస్నాబాద్ వైపు వెళ్లే రోడ్డులో గానుగుపహాడ్ వద్ద బ్రిడ్జి మరమ్మతులకు రూ.90 లక్ష లు కోరినా ఆలస్యం చేశారు. చివరికి 5 గురు యువకులు ఆందోళన చేసి జైలు వెళ్లిన తర్వాతే నిధులు మంజూరు అయ్యాయని, అలాగే చీటకోడూరు గ్రామానికి వెళ్లే రోడ్డు దయనీయ స్థితిలో ఉంది. ఎంఆర్ఆర్ కింద నిధులు మంజూరు అయినా పనులు ప్రారంభం కాలేదని, బండనాగారం నుంచి




కట్కూర్, సుందరయ్య నగర్ నుంచి జనగామ, లద్దునూరు నుంచి వంగపల్లి రోడ్లకు రూ.13 కోట్లు మంజూరు అయ్యాయని . 2 సంవత్సరాలైనా పనులు ప్రారంభం కాలేదన్నారు. హ్యామ్ కింద మంజూరు చేసిన 3 రోడ్లకు ఇప్పటికీ టెండర్లు పూర్తి కాలేదని, ముస్త్యాల నుంచి వడ్లకొండ, చేర్యాల నుంచి నాగపూరి, రేబర్తి నుంచి కొండాపూర్, పంచాయతీ రాజ్ కింద 18 రోడ్లు మంజూరు చేసినా 2 సంవత్సరాల 3 నెలల్లో ఒక్క మీటర్ రోడ్డు కూడా వేయలేదని టెండర్లు కూడా ప్రారంభం కాలేదని . సిద్దిపేట దుద్దెడా నుంచి జనగామ హైవే , రోడ్డు పనులు పూర్తిచేయడంలోపూర్తిగా విఫలం అయ్యిందన్నారు. చేర్యాల పట్టణంలో రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వేలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయని, బచ్చన్నపేట వద్ద 2 కి.మీ రోడ్డు రాళ్లతోనే ఉంది. చంపక హిల్స్ దగ్గర రోడ్డు ప్రమాదకరంగా ఉంది.. రెండు వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. కల్వర్టులు సీసీతో, మిగతా రోడ్లు తారుతో ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, నాగిరెడ్డి పల్లి ప్రాంతానికి బస్సులు లేక విద్యార్థులు ఇతర జిల్లాకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి.. గజ్వేల్ నుంచి బచ్చన్నపేట మీదుగా హైదరాబాద్ మార్గంలో బస్సు లు తగ్గించారు. మద్దూర్, సలాకాపూర్, దూల్మెట్ ప్రాంతాల్లో బస్సులు సగానికి తగ్గించారు.వెంటనే రోడ్ల పనులు ప్రారంభించి పూర్తి చేయాలని, హైవేలు మరమ్మ తు చేయాలని, బస్సుల సంఖ్య పెంచి పునరుద్ధరించాలన్నారు. ఈ సమ స్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే స్పీకర్ ద్వారా సంబంధిత మంత్రికి విజ్ఞప్తి చేశారు.



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

# మెరుగైన వైద్యం అందాలి

## పదో తరగతి పరీక్షా కేంద్రాల ఆకస్మిక తనిఖీ

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 18(ప్రభాత ఉదయం)**

పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని నెల్లుట్ల గ్రామ పంచాయతీ పరిధిలో గల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, అలాగే దేవరుప్పుల మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ, హాజరు వివరాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ప్రశ్నపత్రాల పంపిణీ విధానం, పర్యవేక్షణ ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ... పరీక్ష కేంద్రాల్లో ప్రశ్నపత్రాల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా సరిచూసుకోవాలని సూచించారు. పరీక్ష తరగతి గదుల్లో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయాలు సరిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న అధికారులకు, సిబ్బందికి విధుల్లో బాధ్యతగా ఉండాలని తెలిపారు. అదే విధంగా దేవరుప్పుల మండల కేంద్ర పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఔషధాల నిల్వలు, వైద్యులు, నర్సుల హాజరు రిజిస్టర్, రికార్డుల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. వైద్య సిబ్బంది అందరూ అందుబాటులో ఉన్నారా? టీకాలు సరిగా వేస్తున్నారా? రోగులకు సరైన చికిత్స అందిస్తున్నారా? వంటి విషయాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో రోగులకు సమయానికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణీలు, శిశువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, తాగునీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు, అవసరమైన అన్ని మందులు నిల్వలో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే సేవలు మెరుగుపడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది తమ విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు.



# బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు

## భక్తులకు సకల ఏర్పాట్లు

## వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేయాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 18(ప్రభాత ఉదయం)**

జిల్లా లోని పాలకుర్తి మండలం, వల్మిడి గ్రామం లోని శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానం లో ఈ నెల 23 నుండి ప్రారంభం కానున్న శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పైన బుధవారం, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా డీసీపీ రాజ మహేంద్ర నాయక్, సంబంధిత అధికారులతో మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వారి బ్రహ్మోత్సవాల కోసం వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేయాలనీ ఆయా శాఖల అధికారులు వారి పరిధిలో గల ఏర్పాట్లన్ని పక్కాగా చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం గా సీటింగ్ ఏర్పాట్లు ఉండాలని, విద్యుత్ సరఫరా లో ఆటంకం ఉండకూడదని , ట్రాఫిక్, క్యూ లైన్, పార్కింగ్ తదితర అంశాల్లో భక్తుల కి ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్వామి వారి దర్శనం సులభం గా దర్శనం చేసుకొని వెళ్లేలా పోలీస్ బందో బస్తు ఉండాలని , త్రాగు నీటి కోసం మంచి నీళ్ల ట్యాంకర్ లని, మెడికల్ క్యాంపు ని ఏర్పాటు చేయాలనీ , అంబులెన్స్ అందుబాటులో ఉండాలని, భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా సరిపడా బస్సులను ఆర్టీసీ వారు అందుబాటులో పెట్టాలని, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అవసరమైన చోట రోడ్ మరమ్మత్తులు చేయాలనీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ లను పంపించాలని, ఫైర్ వెహికిల్ కూడా అందుబాటులో పెట్టాలని, శానిటేషన్ కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపట్టాలని, ఫుడ్ సేఫ్టీ అధికారులు, భోజనాలను చెక్ చేయాలనీ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశం లో ఆర్డీవో వెంకన్న, ఏసీపీ నర్సయ్య, ఆలయ ఈఓ, పాలకుర్తి తహసీల్దార్, విద్యుత్, వైద్య, పంచాయతీ రాజ్, పోలీస్, ఆర్టీసీ, ఫైర్, పంచాయతీ రాజ్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608